వెండి మొలతాడు

—కొట్రగడ్డి దయానంద్

నేనప్పుడు చిన్న పిల్లవాణ్ణి! రోజు పొద్దుటిపూట మూడో తరగతి తెలుగు వాచకంలోని పద్యాల్ని కంఠతా పడుతూ తెల్లటి నేత దుప్పటిలో వెచ్చగా ఒదుక్కుని కూర్చునేవాణ్ణి. అలా కూర్చుని ఇంటి ముందు వేపచెట్టువెనక ఎర్రటి, గుండ్రటి దానిమ్మ పండులా పొడిచే సూర్యుణ్ణి చూసేవాణ్ణి. అప్పుడు అమ్మమ్మ ఏ పని చేసినా ఇష్టంగా ఉండేది. నిద్రలేవగానే కోళ్ళను ళ్లేవదీసేది. వయసుమీద పడుతున్నా ఇల్లంతా ఊడ్చి తెల్లారకముందే కళ్ళాపు చల్లేది.

సద్దికూటి వేళకు కిర్రు చెప్పులతో కాళ్ళీడ్చుకుంటూ తాతయ్య పొలాన్నుంచి వస్తుంటే అమ్మమ్మ గడగడలాడేది. నిలువెల్లా వణికేది. ఎక్కడి వస్తువులక్కడ సర్దేది. ఆయన వచ్చీరాగానే చెప్పులిడిచి ఉప్పునీళ్ళతొట్టి దగ్గర ముఖం కడుక్కునే వాడు. ఒక్కోసారి ఆయన పొలాన్నుంచి వస్తూనే అమ్మమ్మ మీద కేకలు వేసుకుంటూ వచ్చేవాడు. చాటుచాటుగా తప్పుకుని తిరిగేది అమ్మమ్మ. ఆయన పళ్ళుకొరుకుతుంటే "అదే ఏదో నూరిపోసి ఉంటుంది" అని గొణుక్కునేది. అన్నం తిన్న తర్వాత ఆయనకు చుట్ట అందించేది. చుట్ట తాగుతూనే మంచమీద కండువా విదిలించి భుజమ్మీద వేసుకునేవాడు. చెప్పులు తొడుక్కుని అమ్మమ్మ ఇచ్చిన చుట్టల్ని తీసుకుని పొలం వెళ్ళేవాడు.

ఆయన వెళ్ళిపోయాక ఈ రోజు గండం గడిచిందని తృప్తిపడేది. తర్వాత ఎవర్నో తల్చుకుని తిట్టిపోసేది.

అప్పుడామె చీర ఉతుక్కుని స్నానం చేసేది. చేతిలో రుద్రాక్షలు తిప్పుతూ జపం చేసేది. జపమయ్యాక పంచపాత్రలో నీళ్ళు మూడుసార్లు తాగి మిగిలిన నీళ్ళను దానిమ్మ చెట్టు కొమ్మల్లో పోసేది. అప్పటికి ఏ నడిజామో అయ్యేది. అన్నం తినబోతూ ఆమె వేసే మొదటి ముద్దకోసం కాకులు ఎదురుచూస్తుండేవి. చీరె ఆరేసుకుని దాన్ని ఎవరూ ముట్టుకోకుండా కాపలా కూర్చునేది.

ఒకసారి తాతయ్య పొలం వెళ్ళిన వాడు హఠాత్తుగా ఇంటికొచ్చేడు. అమ్మమ్మ పూజలో కూర్చుని దీపారాధన చేస్తూంది. అమ్మమ్మ ముందు దేవుడి పటం ఉంది. దాని ముందు దీపారాధన కుంది భగభగా వెలుగుతోంది. అమ్మమ్మ చేతిల్లో రుద్రాక్షమాలా, నోట్లో ఏవో శ్లోకాలూ తిరుగుతున్నాయి.

ఆయన వచ్చీరాగానే అంతా చూసి 'సీయమ్మా' అంటూ రంకె వేశాడు. అమ్మమ్మ అర్ధాంతరంగా పూజలోంచి వణుకుతూ లేచింది.

"ఇంకేం? తెచ్చిన నూనె అంతా దీపారాధనకు తగలెయ్యడం, నూనెలో అన్నం ముంచి నిప్పుల్లో తగలెయ్యడం! ఇందుకన్నమాట నెలరోజులు రావాల్సిన నూనె పది రోజులే రావడం" అంటూ చిందులు తొక్కేడు.

అమ్మమ్మ వీపుమీద ఆయన చెయ్యి ఆడింది. ఆ రోజంతా ఆయన వీరంగం చేస్తూనే ఉన్నాడు. అమ్మమ్మ చాటుగా కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూనే ఉంది.

మరోరోజు ఆమె అన్నం తినబోతూ మొదటి ముద్దను కాకులకని ఇంటి చూరు మీద ఉంచింది. చేలో పురుగు మందు కొట్టి వేళ తప్పి ఇంటి కొచ్చేడు తాతయ్య. వచ్చీరాగానే ఇంటిమీద గోలగోలగా అరుస్తూ అన్నం కోసం పొడుచుకుంటున్న కాకుల్ని చూశాడు. పళ్ళు కొరుకుతూ "ఇంకేం! నేనక్కడ చేలో ఎండ్రిన్ పోసి కాకుల్ని చంపడం, నువ్విక్కడ వాటికి ముద్దేసి పుణ్యం సంపాదించడం" అని వెటకారం చేసి మళ్ళీ వీరంగం చేశాడు.

తాతయ్య ఇంట్లో ఉన్నంతసేపూ అమ్మమ్మ భయం భయంగానే తిరిగేది. ఆయన వెళ్ళిపోయాక రోజూ మధ్యాహ్నం చుట్టలు చుడుతూ తనలో తాను పెద్దగా మాట్లాడుకునేది. ఆయన తనను తిట్టడానికీ, రాచి రంపాన పెట్టడానికీ 'ఆ మాయముండే' కారణమని అనుకునేది. 'పొలాన అన్నీ నేర్పి తనమీదకు రోజూ యుద్ధానికి పంపుతుందని మండిపడేది. 'దాని పిరును మండ' అని తిట్టుకునేది. ఒక్కోసారి నిట్టూర్చేది. ఒక్కోసారి వెక్కి వెక్కి ఏడ్చేది. 'పాతికేళ్ళ నుంచీ నా బతుకింతేగదా' అని వీదరించుకునేది.

ఆమె ఎవరో నాకు తెలీదు.

తాతయ్యకు అప్పుడప్పుడూ సద్దన్నం చేనుకాడికి మోసుకెళ్ళేవాణ్ణి. అయన్ని అంటిపెట్టుకుని ఆమె ఉండేది. తాతయ్య కుంటలోంచి నీళ్ళు మోస్తుంటే ఆమె ఎదురెళ్ళి అందుకుని మిరపనారుకు నీళ్ళు చల్లేది. తాతయ్య గెనమ్మీద కూర్చుని బువ్వ తాగుతుంటే ఆమె దోసిళ్ళలో పోస్తూ పచ్చి మిరపకాయలు అందించేది. ఆయన తాళ్ళు పేనుతుంటే ఆమె గొడ్లకు నీళ్ళు పెట్టేది. తాతయ్య పై నుండి వామివేస్తుంటే ఆమె కింద ఉండి గడ్డి మోపులు అందించేది. ఇద్దరూ విశ్రాంతిగా కూర్చుని చుట్టలు తాగుతుంటే వాళ్ళ తలల మీదినుంచి పిట్టలు అరుచుకుంటూ వెళ్ళేవి. ఆమె అమ్మమ్మలాకాకుండా గోచీ పెట్టుకుని నల్లగా దృఢంగా ఉండేది. చేసే చేతికీ కదిలే కాలుకూ క్షణం తీరికలేకుండా పొద్దస్తమానం చాకిరీ చేసేది. చేసీ చేసీ ఏ రాత్రో ఆ గొడ్ల కొష్టంలోనే ఒక మూల మంచమ్మీదవాలిపోయేది. ఆమె ఎప్పుడూ ఊళ్ళోకి వచ్చేదికాదు. అమ్మమ్మ ఎప్పుడూ పొలం చేరేది కాదు.

ఆమె నన్ను దగ్గరకు తీసుకొనేది. లాలించేది. ముద్దు చేసేది. తనకు పిల్లలు లేనందుకు కళ్ళనీళ్ళు పెట్టుకునేది. అమ్మమ్మ ఏం చేస్తుందని యోగక్షేమా లడిగేది.

అన్నీ చెప్పేవాణ్ణి. తిధుతున్నాడనీ కొడుతున్నాడనీ వివరించే వాణ్ణి. ఆమె కళ్ళు జ్యోతులయ్యేవి. చేతులు బిగుసుకునేవి. తాతయ్యరాగానే తగాదా పెట్టుకుని అడిగేది. ఆయన నవ్వి ఊరుకునేవాడు. ఆమె గట్టిగా నిలదీసేది. బూతులు తిట్టేవాడు. తనూ గట్టిగానే తిట్టేది. పోట్లాడుకుంటూనే ఆమె జుట్టువంచి వీపు మీద గుద్దేవాడు. ఆమె అమ్మమ్మలా ఏడ్చేది కాదు. ఎదురు తిరిగి నిలిచేది. ఇంటికొచ్చాక అమ్మమ్మకు చెబితే

"సాని దానికి సిగ్గేమిటి? నీముందే దాని నాటకాలన్నీను. అసలు కథ నడిపించేదే అదైతే! నీకేం తెలీదు. నువ్వూరుకో" అని మళ్ళీ ఏడ్చేది.

ఆ రోజు.....

సూర్యుడు పడమరకు వాలిపోయేడు. చిరుచిరు చీకట్లు కమ్ముకున్నాయి. ఇంటి ముందు తూముల దగ్గరి అరుగుల మీదికి ఒక్కొక్కరే చేరుకుంటున్నారు.

తాతయ్య పొలాన్నుంచి వచ్చేడు. అలసిపోయిన ట్లున్నాడు. రాగానే చెప్పులిడిచి చెంబుడు నీళ్ళు తాగేడు. కాళ్ళు కడుక్కుని తలకు చుట్టిన కండువా విదిలించి ముఖం తుడుచుకున్నాడు. చదువుకుంటూనో, బొమ్మలు గీసుకుంటూనో ఉన్న నన్ను పిలిచేడు. పిలిచి "మీ అమ్మమ్మ దగ్గర పదిపైసలు తీసుకువెళ్ళి ఖాదర్ బొంకులో బఠానీలు కొనుక్కురా" అన్నాడు. అని మళ్ళీ "వద్దులే! ఇంట్లో కెళ్ళి నాలుగు కంది బేడలు తీసుకురా" అన్నాడు. వేయించిన కంది బేడలు ఆయన ఒళ్ళో పోస్తే ఒక్కో గింజను పుటుక్కున కొరికేడు. అలావే మంచమ్మీద వాలేడు తాతయ్య. మళ్ళీ లేవలేదు.

గట్టిగా, నిఠారుగా, అమ్మమ్మకన్నా చిన్నవాడిగా ఉండే తాతయ్య మంచాన పడ్డాడు. డాక్టరొచ్చి పక్షవాతమన్నాడు. రోజులు లెక్కించాల్సిందేనని చెప్పేడు. ఒక్కొక్కరే బంధువులొస్తున్నారు. చూసి పోతున్నారు. ఇల్లంతా సందడిగా తయారైంది.

ఆమెకూ తెలిసినట్లుంది.

ఒకరోజున పొలాన్నుంచి చీకట్లో వచ్చింది. పశ్చిమంటింట్లో తాతయ్య మంచం దగ్గరకు చేరింది. పడిపోయిన ఆయన చేతిని తన చేతుల్లోకి తీసుకుంది. తాతయ్య కళ్ళు తెరిచేడు. ఆరాగా చూసి గుర్తు పట్టేడు. పెదాల మీద దీపం వెలిగించేడు. ఆమె కొంగునున్న మూట విప్పింది. కంది గుగ్గిళ్ళు ఆయన నోటికందించింది.

"అదిగో! ఏదో మందు పెడుతూంద"ని గుసగుసలాడేరు బంధువులు. తాతయ్యకు కళ్ళతోనే ధైర్యం చెప్పింది. ఒళ్ళంతా నిమిరింది. తాతయ్య ఆమె గుప్పెట్లో ఏదో ఉంచేడు. నా గుర్తుగా ఉంచమన్నట్టుగా చూశాడు. తీసుకుని కళ్ళకద్దుకుంది. వాళ్ళిద్దరూ ఒక్కముక్కా మాట్లాడుకోలేదు.

ఆయన దగ్గర సెలవు తీసుకుంది. బయటికొచ్చి అమ్మమ్మ దగ్గర ఆగింది 'అక్కా!' అంటూ భోరుమని అమ్మమ్మ చేతులు పట్టుకుంది. అమ్మమ్మ చేతులు విదిలించుకుని వెనక్కు తీసుకుంది.

"ఇంకా ఏం బావుకుందామని వచ్చేవు తల్లీ! ఇన్నాళ్ళనుంచీ నన్ను నాశనం చేసింది చాల్లేదా?" అమ్మమ్మలడిగింది.

"సగం పొలం నీ పేరనే రాశాడుగా! ఇంకేం? ఇంట్లో కూడా భాగం కావాల్నా!" అమ్మ అంది.

ఆమె ఏడవటం ఆపింది. వాళ్ళను విచిత్రంగా చూసింది. నన్ను దగ్గరకు తీసుకుని 'నాకేం పిల్లలా జెల్లలా? నాకెందుకమ్మా ఆస్తిపాస్తులు' అంది 'తాతయ్యను కనిపెట్టుకుమండు' అని పైట చెంగునెత్తిమీద నుంచి కప్పుకుని నన్ను ముద్దాడి చీకట్లో కలిసింది.

"పెళ్ళైన మూడు నెల్లకే మొగుడు పాము కరిచి చస్తే ఏదో జీతగాడి పెళ్ళాంకదా! దిక్కు లేనిదని దగ్గరకు తీస్తే! అదే నా మెడకు పామై చుట్టుకుంది" అమ్మమ్మ ఏడుపు మొదలు పెట్టింది.

ఆ నడి రాత్రి తాతయ్య వెర్రికేక వేశాడు. అందరూ లేచి ఆయన మంచం చుట్టూ మూగారు. అమ్మమ్మ తాళి బొట్టుకళ్ళ కద్దుకుంది. "జీవిపోతుంది. మంచం దింపమన్నా"రెవరో. ఆయన నోట్లో నీళ్ళు పోసేను. మంచం దింపేరు. తాగిన నీళ్ళు బయటికొచ్చినై. కదలకుండా కాలిబొటన వేళ్ళు కట్టేరు.

ఏడుపులు మొదలయ్యాయి. ఆయన తలదగ్గర దీపం పెట్టేరు. జారిపోయిన ఆయన పంచెను ఒగదీసి కట్టడానికి ఎవరో ఆయన నడుమ్మీద మొలతాడు కోసం వెదికేరు.

దొరకలేదు.

"అబడుకు మొలతాడు కూడా తెంపుకుపోయింది" అన్నారెవరో. కోపమొచ్చింది నాకు. విసురుగా ఆ చీకట్లో వేపచెట్టుకిందికి చేరాను.

ఇల్లంతా ఏడుపులతో తెల్లారింది.

పొలాన్నుంచి కబురొచ్చింది. పరుగెత్తుకెళ్ళేను. ఆమె పశువుల కొష్టంలో మంచమ్మీద కదలక మెదలక పడుకునుంది. నిద్దపోతున్నట్టే ఉంది. మళ్ళీ ఆమెలేవలేదు.

ఒంటరి పల్లంచి పిట్టలా ఉంది ఆమె. ఆమె మెడలో తాతయ్య వెండి మొలతాడు వేలాడుతోంది.

మొదటిసారిగా "అమ్మమ్మా" అంటూ ఏడ్చేను. ●



ఒకరోజున పొలాన్నుంచి చీకట్లో వచ్చింది... తాతయ్య కళ్ళు తెరిచేడు. ఆరాగా చూసి... పెదాలమీద దీపం వెలిగించేడు.